సాక్షి ఖమ్మం

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటల్లో తెగుళ్లను అరికట్టవచ్చని డీఏఓ పుల్లయ్య వెల్లడించారు.

8లో



తూకంలో తేడాతో మోసం

కాంటాను రిమోట్‌తో ఆపరేట్ చేస్తూ పత్తి తూకంలో రైతులను మోసం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో

గరిష్టం / కనిష్టం
$30^{\circ} / 15^{\circ}$

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది. మిగతా సమయంలోనూ సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

విశ్వసనీయతే కీలకం



కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సునీల్‌దత్



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కానిస్టేబుళ్లు

పోలీసులు ప్రజాసేవకు అంకితం కావాలి

- మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- ఖమ్మం సీటీసీలో ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్
- శిక్షణ పూర్తిచేసుకున్న 263మంది కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: సమాజంలో పోలీసు వ్యవస్థపై విశ్వసనీయత మరింత పెరిగేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రజాసేవకు అంకితం కావడం ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఖమ్మం సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో రాచకొండ కమిషనరేట్‌కు చెందిన 92మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, రామగుండం, వికారాబాద్‌కు చెందిన 171 మంది సివిల్ కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల గురువారం శిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్(దీక్షాంత్ పరేడ్) కుటుంబీకులు, సన్నిహితుల నడుమ కనుల పండుగగా జరిగింది. ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఐజీ.. 'విధినిర్వహణలో వివక్ష చూపబోం.. మా సేవలతో దేశ ప్రతిష్ట పెంచుతాం' అని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజల రక్షణే మన బాధ్యత

ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం పోలీస్ శాఖ ఉద్యోగులకు ఉంటుందని తెలిపారు. ఈవిషయాన్ని గుర్తించి అప్పగించిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజల రక్షణ ధ్యేయంగా, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. నిత్యం పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉన్నందున ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అవినీతి ఆరోపణలు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. నేరస్తులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటున్నందున ఈ బ్యాచ్ కానిస్టేబుళ్లకు శిక్షణలో కొత్త చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించామని ఐజీ తెలిపారు. కాగా, శిక్షణ కానిస్టేబుళ్లు సెప్టెంబర్ మొదటి వారంలో మున్నేటి వరదల సమయాన బాధితులకు విస్తృతమైన సేవలందించారని గుర్తు చేశారు.

ఇక్కడితో ఆగొద్దు....

దీక్షాంత్ పరేడ్‌కు హాజరైన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు కుటుంబ నేపథ్యాన్ని ఐజీ వివరించారు. రోహిత్‌రాజు తండ్రి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి ఏఎస్సైగా రిటైర్ అయ్యారని తెలిపారు. అయితే, తన కుమారుడిని మాత్రం బాగా చదివించి ఐపీఎస్‌గా చేశారని చెప్పారు. అలాగే, కానిస్టేబుళ్ల ఇక్కడితో ఆగకుండా ఉన్నత విద్య చదువుతూ మంచి స్థాయికి ఎదగాలని, పిల్లలను కూడా తీర్చిదిద్దాలని ఐజీ సూచించారు.



శిక్షణ పూర్తిచేసుకున్న కుమారుడిని భావోద్వేగంతో హత్తుకున్న తల్లి

టాపర్లు వీరే...

ఖమ్మం సీటీసీలో ఈ ఏడాది ఫిబ్రవరి 21న ట్రెయినీ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభమైంది. సీటీసీలో ఇది ఎనిమిదో బ్యాచ్ కాగా, వీరిలో టాపర్లను ప్రకటించారు. రాచకొండకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు పి.రఘు, కె.కిషోర్, రామగుండంకు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు జి.ప్రశాంత్, ఎం.నవీన్‌కుమార్, డి.ప్రదీప్ టాపర్లుగా నిలవగా.. బెస్ట్ ఆల్ రౌండర్ హరీష్ ఐజీ చేతుల మీదుగా జ్ఞాపికలు అందుకున్నారు. ఇంకా ఈ సమావేశంలో ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్, అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రఘు, రెహమాన్, రవి, శ్రీనివాసులు, సాంబరాజు, నర్సయ్య, సుశీల్‌సింగ్, ఎస్‌బీ సీఐ రాజిరెడ్డి, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్, డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాచకొండ యూనిట్‌లో టాపర్‌గా అవార్డు అందుకుంటున్న రఘు

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఆరోగ్యశ్రీ వార్డులో రిజిస్టర్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకంతో వచ్చే వారితో మర్యాదగా వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్యం అందించాలని.. అలాకాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆరోగ్యశ్రీ ఇన్‌పేషంట్ విభాగం, ఓపీ విభాగం, డైట్ రూంలో రిజిస్టర్లు పరిశీలించి రోజువారీ వైద్యసేవలు, ఎందరికి భోజనం సమకూరుస్తున్నారో తెలుసుకున్నారు. ఆతర్వాత డ్రగ్ స్టోర్‌కు వెళ్లగా రిజిస్టర్లలో వివరాలు సక్రమంగా నమోదు చేయడం లేదని గుర్తించారు. గతంలోనూ ఫార్మసీ సూపర్‌వైజర్‌కు రెండు సార్లు సూచించినా తీరు మార్చుకోనందున షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వైద్యులు, ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, మందుల కొరత ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆర్ఎంఓ బి.రాంబాబు తదితరులు ఉన్నారు.

గ్రూప్-2 మైనార్టీ అభ్యర్థులకు మాక్ టెస్ట్‌లు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ(ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్శి, బౌద్ధులు) అభ్యర్థులకు ఉచిత ఆఫ్‌లైన్ మాక్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. వచ్చేనెల 2, 3, 9, 10వ తేదీల్లో తెలంగాణ మైనార్టీ స్టడీసర్కిల్ ఆధ్వర్యాన పరీక్షలు ఖమ్మంలో ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 29లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సత్యనారాయణ సూచించారు.

కోర్సుల్లో ప్రవేశానికి 25, 30న కౌన్సెలింగ్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని వివిధ కోర్సుల్లో ప్రవేశానికి రెండు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. రెండేళ్ల కాలపరిమితితో డిప్లొమా ఇన్ అనస్తీషియా, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలకు కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. ఈనెల 25, 30వ తేదీల్లో జరిగే కౌన్సెలింగ్‌లో బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, ఎంపీసీ విద్యార్థులకు ఆ తదుపరి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

అసంక్రమణ వ్యాధుల కట్టడికి కృషి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో అసంక్రమణ వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో గురువారం సమీక్షించిన ఆమె పలు అంశాలపై సమీక్షించారు. పట్టణ ప్రాంతాల్లో సిబ్బంది వివరాల నమోదులో వేగం పెంచి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాతా శిశు సంక్షేమం, వ్యాక్సినేషన్, ఆన్‌లైన్ నమోదును సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ లక్ష్యాల సాధనపై వైద్యులు దృష్టి సారించాలన్నారు. ఆతర్వాత జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్ పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సమీక్షలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ రామారావు, డెమో సాంబశివరెడ్డి, హెచ్ఈఓ సత్యనారాయణ, హెచ్ఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఏసీగా రాములు

ఖమ్మం సహకారనగర్: డీఈఓ కార్యాలయంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా బి.రాములుకు బాధ్యతలు అప్పగించారు. ఇన్నాళ్లు ఏసీగా ఉన్న ధనా సెలవుపై వెళ్లటంతో రఘునాథపాలెం ఎంఈఓ రాములుకు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, విద్యార్థుల్లో ఇంగ్లిష్ పరిజ్ఞానం పెంచేందుకు ప్రారంభించిన 'వీ కెన్ లెర్న్' కార్యక్రమాన్ని రెండో దశగా 17 పాఠశాలల్లో అమలు చేయనున్నారు. ఆయా పాఠశాలల ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

పనితీరు మార్చుకోండి..

ఇంజనీర్లపై ఎస్ఈ ఆగ్రహం



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: సాగర్ కాల్వల పరిరక్షణ కోసం ఇంజనీర్లు నిరంతరం పరిశీలించాలని జలవనరులశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈవిషయంలో నిర్లక్ష్యాన్ని విడనాడి పనితీరు మార్చుకోవాలని సూచించారు. సాగర్ ప్రధాన కాల్వను గురువారం ఆయన ఖమ్మం నుంచి ఏన్కూరు వరకు పరిశీలించారు. పలుచోట్ల కాల్వను ఆనుకుని పంటలు సాగు చేస్తుండడాన్ని గుర్తించారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్వ వెంటే పంటల సాగుతో కట్టల మట్టి కరిగిపోతోందని తెలిపారు. ఇకనైనా దీన్ని అరికట్టడంతో పాటు పొలాలకు సాగు నీరందేలా పర్యవేక్షించాలని సూచించారు. తనిఖీల్లో ఈఈ అనన్య, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

28న ఆర్టీసీ కార్గోలో పాత పార్సిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలోని కార్గో సెంటర్‌లో వినియోగదారులు తీసుకెళ్లని పాత పార్సిళ్లను ఈనెల 28న వేలం వేయనున్నట్లు లాజిస్టిక్ మేనేజర్ రామారావు తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో 28న సాయంత్రం 4 గంటలకు వేలం మొదలవుతుందని వెల్లడించారు. పార్సిళ్ల క్లియరెన్స్ కోసం ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం ప్రతీ పౌరుడి హక్కు

- కోడిగుడ్ల కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేయండి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి



మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆనంద్, పక్కన సభ్యురాలు జ్యోతి, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖమ్మం సహకారనగర్: పౌరులంతా పౌష్టికాహారం అందుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతి తెలిపారు. ఈ మేరకు అమల్లో ఉన్న ఆహార భద్రత చట్టాన్ని అధికారులు పక్కాగా అమలు చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఆహార భద్రత చట్టం అమలుపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి వారు అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు, పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న న్యూట్రీ గార్డెన్ల వివరాలను అధికారులు వెల్లడించారు. అనంతరం సభ్యులు ఆనంద్, జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక అభివృద్ధికి అవసరమైన పోషకాలు అందేలా భోజన మెనూ రూపొందించినందున అమలుచేయాలన్నారు. అయితే, వెజిటబుల్ బిర్యానీ, కోడిగుడ్ల సరఫరాలో లోపాలు గుర్తించామని తెలిపారు. ఈ మేరకు గురుకులాలకు చిన్న సైజ్ కోడిగుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్ మెమో జారీ చేయడమేకాక తీసుకున్న చర్యలపై 15రోజుల్లో నివేదిక అందించాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీసీఓ చందన్‌కుమార్, జిల్లా మేనేజర్ జి.శ్రీలత, వివిధ సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, రాంగోపాల్‌రెడ్డి, జ్యోతి, విజయలక్ష్మి, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, రేషన్‌డీలర్ల సంఘం నాయకులు వెంకన్న, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ తనిఖీ చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించి గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ బి.రాంబాబు, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ బాబు రత్నాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సైదులు పాల్గొన్నారు.

చేపల మార్కెటింగ్‌పై దృష్టి సారించండి

- తద్వారా మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి
- ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మత్స్యకార దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవ్యవసాయం: మత్స్య సంపదతో అనేక రకాల ప్రయోజనాలు ఉన్నందున మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తే మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపల వినియోగం పెరుగుతున్న నేపథ్యాన పెంపకం, మార్కెటింగ్‌పై దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహారంలో కీలకమైన చేపలపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉచిత చేపపిల్లలు పంపిణీ చేస్తున్నందున మత్స్యకారులు వాటిని కాపాడుకుంటే మంచి లాభాలు వస్తాయని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జ్ మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు. కాగా, ఆసరా పింఛన్లు, బీమా సౌకర్యం కల్పించడమే కాక లైఫ్ జాకెట్లు సమకూర్చాలని, గంగపుత్ర సంఘం భవనానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కన్నం ప్రసన్నకృష్ణ, దేశబోయిన మంగారావుతో పాటు పెద్దపల్లి సుధాకర్, వంగాల వెంకట్, చేతి కృష్ణ, చింతల మల్లేశం, దేశబోయిన తిరుపతయ్య, మైస శంకర్, సురేష్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతపై సిబ్బందికి సూచనలు చేయడంతో పాటు ఆవరణను శుభ్రం చేయించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్.స్వామి, డీటీ అన్సారీ ఉన్నారు.

పాఠం విని.. చదువు చెప్పి !

చింతకాని: చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాలోని చింతకాని మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన ఆరో తరగతి గదిలో ఉపాధ్యాయురాలు ఇంగ్లిష్ బోధిస్తుండగా విద్యార్థులతో కలిసి విన్నారు. ఆతర్వాత ఇంగ్లిష్‌లో రాణించేలా ఎలా చదవాలో విద్యార్థులకు వివరించారు. ఆపై కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులతో కలిసి డిజిటల్ ల్యాబ్‌లో నేలపై కూర్చొని వీడియో పాఠం వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తొలి దఫా జిల్లాలోని 50 పాఠశాలల్లో కూరగాయల సాగు కోసం ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్ల సంరక్షణ బాధ్యత విద్యార్థులే తీసుకోవాలని తెలిపారు.



విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని వీడియో వీక్షిస్తున్న కలెక్టర్

రైల్వేలైన్‌కు భూసేకరణ పూర్తి



ఇళ్ల వద్ద కొలతలు వేస్తున్న అధికారులు

మధిర: కాజీపేట–విజయవాడ రైల్వే మార్గంలో మూడోలైన్ నిర్మాణం చేపడుతుండగా మధిర పట్టణంలో నెలకొన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఇప్పటికే మూడో లైన్ ఎర్రుపాలెంలో పూర్తయినా మధిర పట్టణంలో మాత్రం స్థల సేకరణ విషయమై అభ్యంతరాలతో ముందుకు సాగడం లేదు. రైల్వే అధికారులు, ఇళ్ల యజమానుల నడుమ వివాదంతో ఈ పరిస్థితి నెలకొనగా పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో రెవెన్యూ అధికారులు మరోమారు సర్వే చేసి అభ్యంతరాలను పరిష్కరిస్తూ కొలతలను సరిచేశారు. అంతేకాక గృహ యజమానులు కోల్పోయిన స్థలానికి పరిహారం అందజేయగా వారు స్థలాలను అప్పగించారు. దీంతో మధిరలో కూడా రైల్వే మూడో లైన్ పనులు త్వరలోనే మొదలుకానున్నాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, రైల్వేశాఖల ఉద్యోగులు మురళి, ఉషారాణి, కె.అశోక్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న హరీశ్‌రావు

నేడు మార్కెట్‌లో కొనుగోళ్ల పరిశీలన



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న పువ్వాడ, నాయకులు

ఖమ్మం మయూరిసెంటర్/చింతకాని: మాజీ మంత్రి హరీశ్‌రావు జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన గురువారం రాత్రి ఖమ్మం చేరుకోగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, నాయకులు స్వాగతం పలికారు. కాగా, శుక్రవారం ఉదయం ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను బీఆర్ఎస్ బృందం పరిశీలించి రైతులతో మాట్లాడనుంది. ఆతర్వాత హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడతారు. అనంతరం చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబం, ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పరామర్శించనున్నారు. అలాడే, లచ్చగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గూని ప్రసాద్ కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శిస్తారని జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్ కోరారు.

భయపెట్టడంతోనే గిరిజనుల తిరుగుబాటు

- హామీలు అమలు చేసేవరకు వదిలేది లేదు
- మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- లగచర్ల గిరిజనులకు సంఘీభావంగా ర్యాలీ



ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ శ్రేణులు, గిరిజనులు

ఖమ్మంమయూరిసెంటర్: భూములు ఇచ్చేది లేదని గిరిజనులు రైతులు తొమ్మిది నెలలుగా పోరాడుతున్నా భయపెట్టి లాక్కునేందుకు యత్నించడంతోనే లగచర్లలో తిరగబడ్డారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. లగచర్ల గిరిజనులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఆధ్వర్యాన ఖమ్మం పెవిలియన్ మైదానం నుండి జెడ్పీసెంటర్ వరకు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు గిరిజనులు పాల్గొనగా మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ వరంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి 1,100 ఎకరాలేగా అని అన్నారని.. ఆయనకు ఇది సాధారణమే అయినా గిరిజనులకు ఆ భూమే జీవనాధారమని తెలిపారు. కేటీఆర్‌ను ఊచలు లెక్కబెట్టిస్తానంటున్న రేవంత్‌రెడ్డి ఆయన ఏం పాపం చేశారో చెప్పాలన్నారు. కాగా, తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను ఎవరూ ఏం చేయలేరని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు పోరాడుతామని పువ్వాడ స్పష్టం చేశారు.

25న మానుకోటలో ధర్నా..

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యాన మహబూబాబాద్‌లో ధర్నాకు సిద్ధమైతే ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. కానీ కోర్టు అనుమతితో ఈనెల 25న అక్కడే ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. లగచర్ల ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ మాట్లాడుతూ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో గిరిజనులపై దమనకాండ కొనసాగిందని విమర్శించారు. ఆయన అల్లుడి కంపెనీ కోసం గిరిజన రైతులను వేధిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఇచ్చిన ఏ ఒక్క హామీని రేవంత్ సర్కార్ అమలు చేయకపోగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుండాల కృష్ణ, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, చిత్రంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు, సండ్ర

క్లుప్తంగా

రేపు ఏఐబీఈ నమూనా పరీక్ష

ఖమ్మం లీగల్: ఆలిండియా బార్ ఎగ్జామ్(ఏఐబీఈ)కు హాజరుకానున్న అభ్యర్థుల కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యాన నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఖమ్మంలోని మానేరు లా కళాశాలలో 23వ తేదీన ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. ఈమేరకు అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


సయ్యద్ అర్షియా

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టులో ఖమ్మంకు చెందిన సయ్యద్ అర్షియా చోటు దక్కించుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆమె ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఖమ్మం శ్రీచైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతూ సర్దార్ పటేల్ స్టేడియంలో ఎం.డీ.అక్బర్ అలీ వద్ద శిక్షణ పొందుతున్న అర్షియాను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి అభినందించారు.

డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మికి పదోన్నతి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న బి.నాగలక్ష్మికి పదోన్నతి లభించింది. ఆమెకు సీఈఓ పదోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ సీఈఓగా నియమించారు. ఈమేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ


రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మిరప తోటల్లో తెగుళ్లను నివారించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య తెలిపారు. కామేపల్లి మండలంలోని గోవింద్రాలలో మిరప తోటలను గురువారం పరిశీలించిన ఆయన తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. పూత, కాత దశలో ఉన్న మిరపను కొమ్మ కుళ్లు తెగులు ఆశిస్తోందని, నీటి పారుదలలో హెచ్చుతగ్గులు లేకుండా చూస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. అలాగే, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటుచేయాలని, గట్లపై పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. కాగా, వరి సాగు చేసిన రైతులు కోతల అనంతరం కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని డీఏఓ తెలిపారు. ఏఓ తారాదేవి, ఏఈఓ ఉష పాల్గొన్నారు.

రెక్కలకు దెబ్బలతో గద్ద

వైద్యపరీక్షలు, పార్క్‌లో సంరక్షణ

నేలకొండపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న గద్దకు వైద్యపరీక్షలు చేయించి సంరక్షణ నిమిత్తం ఖమ్మం అర్బన్ పార్క్‌కు తరలించారు. మండలంలోని సుర్దేపల్లికి చెందిన గరిడేపల్లి రామారావు పొలంలో మూడు రోజులుగా గద్ద ఉంటోంది. అయితే, దాని రెక్కలకు దెబ్బ తాకడంతో లేవలేని పరిస్థితిలో ఉండగా ఆయన అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.నర్సింహారావు, ఉద్యోగి మధు గురువారం దానికి నేలకొండపల్లి పశువైద్యశాలలో చికిత్స చేయించాక బోనులో ఖమ్మం అర్బన్ పార్క్‌కు తరలించారు. గద్ద కోలుకున్నాక అటవీ ప్రాంతంలో వదిలేస్తామని ఎఫ్‌బీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్లేడు మాజీ సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం నుండి ఆయన బైక్‌పై సుబ్లేడు వెళ్తుండగా బంక్ సమీపాన ఖమ్మం నుండి బంగ్లా వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సంజీవయ్య తల, కాళ్లు చేతులకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,000	4,200
మిర్చి	15,300	5,000
మిర్చి తాలు	7,000	6,700
ఏసీ మిర్చి	16,600	7,000
పత్తి	6,750	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.19,144

కల నెరవేరిన వేళ..!

ఏ వ్యక్తి జీవితంలోనైనా ఉద్యోగం సాధించడం ఓ కల. ఆ కల నెరవేర్చుకుందుకు యువత రాత్రింబవళ్లు కష్టపడ్డారు. పోలీసు కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించిన వారు ఖమ్మం సీటీసీలో తొమ్మిది నెలల పాటు కఠినమైన శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మంలో నిర్వహించిన పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొనగా... వారి కుటుంబీకులు హాజరయ్యారు. పరేడ్ అనంతరం కానిస్టేబుళ్ల కుటుంబీకులు, బంధువులతో తమ ఆనందాన్ని పంచుకుంటుండగాపలువురి కళ్లలో ఆనంద భాష్పాలు కనిపించాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం


శిక్షణ పూర్తయిన ఆనందంలో కానిస్టేబుళ్లు


ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్, అధికారులు



కానిస్టేబుల్‌కు స్వీట్లు తినిపిస్తున్న కుటుంబీకులు


ఆనందాన్ని భార్యతో పంచుకుంటూ...


సంప్రదాయ దుస్తులతో సన్మానిస్తున్న బంధువులు

సవాళ్లతో కూడిన ఉద్యోగంపై మక్కువ

- పోలీస్ ఉద్యోగం సాధించడం మా అదృష్టం
- శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల మనోగతం

ఖమ్మంక్రైం: చిన్నప్పటి నుంచి పోలీసు యూనిఫాంపై మక్కువ.. సవాళ్లతో కూడిన ఉద్యోగమైనప్పటికీ ఎలాగైనా పోలీసు కావాలన్నది లక్ష్యం. అందు కోసం విద్యార్థి దశ నుంచే తపించిన వారు ఎట్టకేలకు ఉద్యోగాలు సాధించారు. పరీక్షలన్నీ దాటుకున్నా ఉద్యోగాలు సాధించుకున్న వారు శిక్షణ కూడా పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం సీటీసీలో శిక్షణ పూర్తిచేసుకుని పాసింగ్ పరేడ్‌లో పాల్గొన్న పలువురు కానిస్టేబుళ్లను పలకరించగా వారి అభిప్రాయాలు వెల్లడించారు.

ఎంతో ఆనందంగా ఉంది....



నేను బీఈడీ వరకు చదివా. కానిస్టేబుల్‌గా తొమ్మిది నెలల శిక్షణ పూర్తిచేసుకోవడం ఆనందంగా ఉంది. నేటి నుంచి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించనుండడం నా అదృష్టంగా భావిస్తున్నాం. కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించడానికి కృషి చేస్తా.

– వెంకటేష్, రామగుండం కమిషనరేట్

ఎంతో కష్టపడ్డా..



పోలీస్ ఉద్యోగం సాధించడానికి రాత్రింబవళ్లు కష్టపడ్డాను. ఖమ్మం సీటీసీలో శిక్షణ పొందడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇక్కడ అధికారులు విధులతో అనేక అంశాలను నేర్పించారు. ఫైరింగ్ విభాగంలో బెస్ట్ ఔట్‌డోర్ ట్రోఫీ అందుకోవడం ఆనందంగా ఉంది.

– నవీన్‌కుమార్, రామగుండం కమిషనరేట్

స్పెషల్ పార్టీలో పనిచేస్తూనే...



మాది యాదాద్రి జిల్లా వలిగొండ మండలం నాగారం. నేను స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా ఎంపికై మూడేళ్ల పాటు పనిచేశా. మళ్లీ సిద్ధమై ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ఖమ్మం పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ బాగుంది. ఎస్‌ఐ కావటమే నా లక్ష్యం.

– లింగస్వామిగౌడ్, రాచకొండ కమిషనరేట్

ప్రజాసేవే ధ్యేయంగా....



కానిస్టేబుల్‌గా ప్రజాసేవ ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతాను. శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు పాటుపడుతా. ఇదే బ్యాచ్‌లో నా సోదరుడు కూడా కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇద్దరం ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకోవడం సంతోషంగా ఉంది.

– వినోద్‌కుమార్, రాచకొండ కమిషనరేట్

గిరిజన బిడ్డ... కానిస్టేబుల్!


తండ్రి రామోజీతో జ్యోతిర్మయి

రఘునాథపాలెం: నిరుపేద కుటుంబంలో జన్మించినా ఆడపిల్ల అనే భావన రాకుండా తల్లిదండ్రులు పెంచడంతో బీఎస్సీ పూర్తిచేసిన ఆమె కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపింది. రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.లెంకు చెందిన తేజావత్ రామోజీ – అనిత దంపతులకు కుమార్తె జ్యోతిర్మయి అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేశాక హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంది. ఈ మేరకు కానిస్టేబుల్ ఎంపికకు పరీక్షలో 117 మార్కులు సాధించగా, వరంగల్ జిల్లా మామనూరులో తొమ్మిది నెలల శిక్షణ గురువారం పూర్తిచేసింది. ఈమేరకు పాసింగ్ ఔట్ పరేడ్‌కు హాజరైన రామోజీ దంపతులు జ్యోతిర్మయిని యూనిఫాంలో చూసి మురిసిపోయారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


రీట్రీట్‌లో జ్యోతి వెలిగిస్తున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మంరూరల్: ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు తోడు సాంకేతిక పరిజ్ఞానాన్ని జైళ్ల శాఖ ఉద్యోగులు అందిపుచ్చుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ ఉద్యోగులకు దానవాయిగూడెంలో నిర్వహిస్తున్న రీట్రీట్‌ను రెండో రోజైన గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన తీసుకొచ్చేలా ఉద్యోగులు కృషి చేయాలని, న్యాయవ్యవస్థ ద్వారా అందేలా ఉచిత సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులు టి.కళాసాగర్, జి.విజయ్‌దేని, జి.వెంకటేశ్వర్లు, ఏ.సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోండి

కొణిజర్ల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, చంద్ర శేఖర్‌రావు సూచించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో పారా లీగల్ వాలంటీర్ కోయిన్ని శంకరరావు ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడొద్దని హితవు పలికారు. ఆతర్వాత కుటుంబ సమస్యలు, బాల్య వివాహాలు, రుణాలు తదితర అంశాలపై న్యాయ సలహాలు అందించారు. మాజీ సర్పంచ్ పొట్లపల్లి శ్రీనివాసరావుతో పాటు బూరప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తూకంలో తేడాతో మోసం..

రిమోట్‌తో కాంటా ఆపరేటింగ్..
క్వింటా పత్తికి 60 కేజీలే నమోదు


తూకాన్ని రిమోట్‌తో తగ్గించే విధానాన్ని వివరిస్తున్న సీఐ మధు

ఎర్రుపాలెం: కాంటాను రిమోట్‌తో ఆపరేట్ చేస్తూ క్వింటా పత్తిని 60కేజీలుగా చూపించి రైతును మోసం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మధిర సీఐ డి.మధు వెల్లడించారు. ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. తల్లాడ మండలం బాలంపేటకు చెందిన గొర్ల కుటుంబరావు, గొర్ల నర్సింహారావు, బడే వెంకటేశ్వరరావుతో పాటు మరో నలుగురు కూలీలతో ట్రాలీ ఆటోలో ఈనెల 19న ఎర్రుపాలెంలోని రైతు మిర్యాల అనిల్‌కుమార్ ఇంటికి వచ్చారు. పత్తి కొనుగోలు చేస్తామని నమ్మించగా, క్వింటా పత్తి ఇస్తే కాంటాలో 60 కేజీలుగా తూకం చూపించారు. ఇదేమని అడిగినా నగదు ఇచ్చేసి వెళ్లిపోయారు. దీంతో మోసపోయినట్లు గుర్తించి అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఇంతలోనే గురువారం మరోసారి ఎర్రుపాలెంకు సదరు వ్యాపారులు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు వారి ఉన్న కాంటాను పరిలించగా రిమోట్ ఆపరేట్ చేస్తూ 10కేజీల పత్తికి మూడు కేజీలకు పైగా తక్కువ చూపిస్తున్నారని తేలింది. దీంతో ముగ్గురిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని, మరో నలుగురు పరారీలో ఉన్నారని సీఐ వివరించారు. కాగా, రైతులు గ్రామాలకు వచ్చే వారికి కాకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనూ పత్తి, ధాన్యం, అమ్ముకోవాలని సూచించారు. ఈసమావేశంలో ఎస్‌ఐ పి.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది పత్తి వ్యాపారుల బైండోవర్

తల్లాడ: పత్తి కాంటాల్లో తేడా చేస్తూరైతులను మోసం చేస్తున్నారనే అనుమానంతో 12 మంది వ్యాపారులను తల్లాడ పోలీసులు గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మండలానికి చెందిన పలువురు వ్యాపారులు ట్రాలీ ఆటోల్లో గ్రామాలకు వెళ్లి అనధికారంగా పత్తి కొనడమే కాక కాంటాల్లో మోసం చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఎర్రుపాలెం, చర్లలో పలువురు రైతులను మోసం చేసిన వ్యాపారులు తల్లాడ మండల వాసులేనని తేలిందని ఎస్సై బి.కొండల్‌రావు తెలిపారు. దీంతో అన్నారుగూడెం, మల్లవరం, బాలపేట, నరసింహారావుపేట, గోపాలపేట గ్రామాలకు చెందిన 12 మంది వ్యాపారులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, ఇకపై గ్రామాల్లో లైసెన్స్ లేకుండా పంటలు కొనుగోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

నేలకొండపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెంకు చెందిన వైష్ణవి(25)కి సూర్యాపేట జిల్లా అనంతగిరికి చెందిన కొండలుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా ఇటీవల కుటుంబ కలహాలు మొదలయ్యాయి. భర్త వేధింపులు భరించలేక నెల రోజులుగా ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. ఈక్రమాన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకోగా కాసేపటికి గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త వేధింపులతోనే వైష్ణవి ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి పున్నయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పెగళ్లపాడులో ఏపీ వాసి

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని పెగళ్లపాడు ఆర్‌బీఓ సమీపాన ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని విశాఖపట్నం జిల్లా ముషిడివాడకు చెందిన పిల్లా కిషోర్(27) తాడుతో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పరిశీలించగా లభించిన ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా కిషోర్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపారు.

డ్రైవర్, కండక్టర్‌ను దూషించడంపై ఫిర్యాదు

నేలకొండపల్లి: చెప్పిన చోటల్లా బస్సు ఆపాల్సిందేనంటూ డ్రైవర్, కండక్టర్‌ను దూషించిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఖమ్మం డిపోకు చెందిన బస్సు గురువారం ఖమ్మం నుంచి చెన్నారం వెళ్లి ఆపై బోదులబండకు చేరుకుంది. గ్రామంలో పలుచోట్ల బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి బస్సుకు అడ్డం పెట్టారు. తాము చెప్పిన చోటల్లా బస్సు ఆపాల్సిందేనని గొడవ పడుతూ డ్రైవర్, కండక్టర్‌ను దూషించారు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించడమే కాక దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్ బి.ఉప్పయ్య, కండక్టర్ సీ.హెచ్.శిరోమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఖమ్మంఅర్బన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించడంతో ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద ఎలాంటి పత్రాలు లేవని తేలిందని వెల్లడించారు.

గడువు దాటిన మందుల విక్రయం


గడువు తీరిన మందుల షీట్

మధిర: గడువు దాటిన మందులను పక్కన పెట్టాల్సిన ఓ మెడికల్ షాపు యజమాని అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి అంటగట్టాడు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన నాగులవంచ అప్పారావు మధిర కళామందిరం రోడ్డులో సెలూన్ నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఆయనకు ప్రమాదం జరగడంతో వైఎస్సాఆర్ చౌరస్తాలోని ఒక మెడికల్ షాపుకు వెళ్లి నొప్పి తగ్గడానికి మాత్రలు ఇవ్వాలని కోరాడు. అయితే, యాంటీ బయాటిక్ మాత్రలు ఇవ్వగా తీసుకెళ్లి గురువారం వేసుకున్నాడు. కాగా, మందుల షీట్‌పై పెన్నుతో రాసి ఉండడంతో అదేమటని ఇంకో వ్యక్తిని తీయగా ఆయన చూసి అవి గడువు తీరిన మాత్రలని చెప్పాడు. ఈ ఏడాది ఆగస్టులోనే ఆ మాత్రల గడువు తీరినట్లు తెలుసుకున్న అప్పారావు షాపునకు వెళ్లి యజమానిని నిలదీయగా సారీ చెప్పి చేతులు దులిపేసుకున్నాడని వాపోయాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె


తండ్రి అంత్యక్రియలకు వెళ్తున్న ఏసుమణి

మధిర: ఓ వ్యక్తి మృతి చెందగా ఆయనకు ముగ్గురూ కుమార్తెలే ఉండడంతో వారే అంత్యక్రియలు పూర్తిచేశారు. మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లికి చెందిన గుండాల ఏడుకొండలు(64)కు ముగ్గురు కుమార్తెలు ఉండగా వారికి వివాహం చేశాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుకొండలు గురువారం మృతి చెందడంతో కుమార్తెలు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆతర్వాత పెద్ద కుమార్తె ఏసుమణి తన చెల్లెళ్లు వెంకటరమణ, ఉషారాణి సహకారంతో తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసి కొడుకులు లేని లోటు తీర్చింది.

సైబర్ క్రైం పోలీసుల అదుపులో యువకులు

వైరారూరల్: వైరా మండలం గొల్లపూడికి చెందిన ఇద్దరు యువకులను గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన సైబర్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ యువకులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తుండగా వర్క్ ఫ్రం హోం విధానంలో ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, వీరిద్దరు ఓ యాప్‌ను రూపొందించి, ఒకే ఐడీతో వేర్వేరు వ్యక్తులకు విక్రయించి మోసం చేశారని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. మహారాష్ట్రలోని పలు కంపెనీలకు యాప్‌ను విక్రయించినట్లు ఆరోపణతో మూడు నెలల క్రితం మహారాష్ట్ర పోలీసులు గొల్లపూడికి చెందిన ఓ యువకుడిని విచారించారు. ఇదే సమయాన ఇంకో యువకుడి బ్యాంకు ఖాతాలో రూ.లక్షల్లో నగదు జమ కావడంతో ఐటీ శాఖ సమాచారం మేరకు సైబర్ క్రైం పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా, హైదరాబాద్ తరలించి విచారించాక వదిలేసినట్లు తెలిసింది.

తండ్రీకుమారుడిని గాయపరిచిన కుక్కలు


మోక్షిత్‌పై కాలిపై గాయం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 13వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలోని పలు వీధుల్లో వీధికుక్కలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. కాలనీలోని రోడ్డు నంబర్ 9లో గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై తండ్రీకుమారుడు కిషోర్, మోక్షిత్ వెళ్తుండగా వీధికుక్కలు వెంటబడి కరవడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. కొంతకాలంగా కాలనీలోని పలు వీధుల్లో కుక్కల సంతతి పెరగగా రాత్రీపగలు తేడా లేకుండా వచ్చివెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ కాలనీలో ప్రైవేట్ పాఠశాలలు ఉండగా పిల్లలు వచ్చివెళ్లేందుకు భయపడుతున్నందున మున్సిపాలిటీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెం సమీపంలోని మున్నేరులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కొమ్ము మహేందర్(57) మృతదేహం గురువారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేందర్ పలువురితో కలిసి మున్నేరులో చేపల వేటకు బుధవారం వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు బుధవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే, గురువారం ఉదయం ఆయన మృతదేహం తేలడంతో బయటకు తీయించారు. ఘటనపై మహేందర్ కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎరువుల లోడ్ వ్యాన్ బోల్తా

కామేపల్లి: ఎరువుల లోడ్‌తో వెళ్తున్న మినీ డీసీఎం అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి కారేపల్లికి గురువారం ఎరువుల బస్తాలు తీసుకెళ్తున్న వ్యాన్ మండలంలోని పండితాపురం బైపాస్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడిగా ఎరువుల బస్తాలు కింద పడడంతో మరో వాహనంలో తరలించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో గురువారం విద్యుదాఘాతంతో మేక వెంకన్న(56) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భవన నిర్మాణ పనుల్లో ఉన్న ఆయన చేతిలోని ఇనుప చువ్వ పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకింది. దీంతో షాక్‌కు గురైన వెంకన్నను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళ..

ముదిగొండ: నీరు తాగేందుకు దిగుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళా కూలీ మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలం గుమ్మళ్లకు చెందిన అంజమ్మ (27) గురువారం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం సమీపాన కూలీ పనులకు వచ్చింది. ఆమెకు దాహం వేయడంతో సమీపంలోని బావిలోకి దిగుతుండగా కాలు జారి పడడంతో మృతి చెందింది. స్థానికుల ఇచ్చిన సమాచారంతో ముదిగొండ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కేసు నమోదు చేశారు.